సాక్షి
గుంటూరు

బుధవారం । 1 । జనవరి । 2025



ఐ లవ్ సత్తెనపల్లి

సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో విద్యుత్ దీపాలతో ఐ లవ్ సత్తెనపల్లి అంటూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అలంకరించారు.



న్యాయశాఖ క్యాలెండర్ ఆవిష్కరణ

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలోని డీజే హాల్‌లో న్యాయశాఖ నూతన క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ.పార్థసారథి ఆవిష్కరించారు.



ఆలయానికి రూ.లక్ష విరాళం

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి కందుల శ్రీనివాసరావు, మాధవి దంపతులు రూ.లక్ష సోమవారం అందజేశారు.

న్యూస్‌రీల్

రేంజ్‌లో 63 మంది సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు జాబితాను సిద్ధం చేశారు. వారం రోజుల కిందట ఈ జాబితాను సిద్ధం చేయగా, 63 మంది సీఐలు ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐలు కె.వేమారెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, ఎస్‌వి.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసుల రెడ్డి, డివి.చౌదరి, ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్.అంటోనిరాజు, ఎం.లక్ష్మణ్, బత్తుల శ్రీనివాస రావు, ఐ.శ్రీనివా సన్, బి.రమేష్‌బాబు, ఎ.అశోక్‌కుమార్, కొంకా శ్రీనివాసరావు, ఏవీ.రమణ, ఎం.హైమారావు, షేక్. కరిముల్లాషావలి, యూవీ.శోభన్‌బాబుతోపాటు పలువురు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతిలో ఉన్నారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాలకు అవకాశం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక , సవరించిన మెరిట్ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువపత్రాలతో జనవరి 1 నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వైద్య కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మెరిట్ జాబితా కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్, గుంటూరు మెడికల్ కాలేజీ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లలో చూడాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ పెట్టండి



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలోని నగరపాలక సంస్థ ఉర్దూ యూపీ పాఠశాలతోపాటు కాసు శాయమ్మ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలను డీఈవో సందర్శించారు. టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉర్దూ యూపీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. చిన్న జీయర్ స్వామిజీ భక్తులకు ప్రవచనాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామిజీ ప్రజలందరూ ఈ సంవత్సరంలో ఆనందోత్సవాలతో జీవించాలని కోరారు.

యార్డుకు 58,387 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 58,387 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 53,319 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 16,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,513 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.








నూతన సంవత్సర సందడి

2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలుకుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. గుంటూరు నగరంలోని పలు ఆలయాలు, ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రార్థనాలయాలలో ప్రార్థనలు చేశారు. పలు స్వీట్ షాపులు కిటకిటలాడాయి. అర్ధరాత్రి 12 గంటల తర్వాత యువత వీధులలోకి వచ్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేరింతలు కొట్టారు. స్వీట్లు పంచుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

సంక్షేమం నుంచి సంక్షోభం వైపు..!

- మోసపు మాటలతో అధికారంలోకి కూటమి
- ఓటర్లను నమ్మించి నట్టేట ముంచిన పాలకులు
- ఉన్న సంక్షేమ పథకాలు కోల్పోయిన ప్రజలు
- కొత్త సంవత్సరం వేళ ఆనందం కూడా కరువు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సంక్షోభం వైపు సాగుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పాలన ప్రజలకు అందింది. మాయమాటలతో ఓటర్లను నమ్మించి గద్దెనెక్కిన కూటమి సర్కార్ మాత్రం ఇప్పుడు రాష్ట్రాన్ని సంక్షోభం వైపు నడిపిస్తోంది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ కులమతాలకు అతీతంగా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందించారు. తర్వాత మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో సంక్షేమం మాట అటుంచితే సంక్షోభంలోకి ప్రజలు చేరుకుంటున్నారు.



సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్ పెంచిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారులను ఎలా తగ్గించాలనే అంశంపై దృష్టి పెట్టింది. మిగిలిన పథకాలన్నింటికీ తిలోదకాలు ఇచ్చింది. సూపర్ సిక్స్ పేరిట హామీలతో ఊదరగొట్టి అధికారంలోకి రాగానే వాటి ఊసే ఎత్తడం లేదు. విద్యార్థులకు ఇచ్చే అమ్మ ఒడి దగ్గర నుంచి ఏ పథకం ఇప్పటివరకూ అమలులోకి రాలేదు. దీంతో ప్రజల్లో ఆర్థికంగా చేయూత లేకపోవడంతో కొనుగోలు శక్తి క్షీణించింది. మార్కెట్‌లో వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాజధాని పేరుతో చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మినహా మరే వ్యాపారం సాగడం లేదు. దీంతో ఏడాది కూడా గడవకముందే కూటమి పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొని ఉంది.

పండుటాకులపైనా ప్రతాపం

సంక్షేమం వైపు ఏ మాత్రం దృష్టి పెట్టని చంద్రబాబు ప్రభుత్వం... పేదల నోటి దగ్గర కూడు కూడా లాక్కొనేందుకు సిద్ధమైంది. పండుటాకులపై తన ప్రతాపం చూపించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో పింఛన్లు తొలగించే ప్రయత్నాలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఐదు నెలల్లో 6,798 పింఛన్లు వివిధ పేర్లతో తొలగించారు.

తాజాగా పైలెట్ వెరిఫికేషన్ పేరుతో ప్రతి జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో పింఛన్లు తనిఖీ చేశారు. పింఛన్ దారుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ మరోసారి వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ వివరాలు సేకరించారు. వీటిలో తేడాలు ఉన్నాయంటూ వాటిని రద్దు చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు. సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, ప్రతిపక్ష పార్టీ నేతలపై తప్పుడు కేసులు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై పెడుతున్న దృష్టిని ప్రజల సంక్షేమంపై మాత్రం పెట్టడం లేదు.

అమలు కాని హామీలు

ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు జిల్లాలో పర్యటించి పలు హామీలు ఇచ్చారు. అవి ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. తల్లికి వందనం కింద విద్యార్థులకు ఏటా రూ. 15 వేలు, నిరుద్యోగులకు భృతిగా నెలకు రూ. 3 వేలు, అన్నదాతకు ఏటా రూ. 20 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ. 1,500, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం.. ఇలా నోటికి వచ్చినట్లు ఊదరగొట్టారు. వీటిలో ఒక్కటీ అమలు చేయలేదు.

రివైండ్ 2024

గుంటూరులో భూగర్భ డ్రైనేజీని పూర్తి చేస్తామని కూటమి నేతలు చెప్పారు. ఇప్పటివరకు దీనిపై చంద్రబాబు సమీక్షించిన పాపాన పోలేదు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో కూడా దీనిపై నిర్ణయం తీసుకోలేదు. గుంటూరు అమరావతి రాజధానిలో భాగం. హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు తోడుగా సైబరాబాద్‌ను నిర్మించి ఒక మహానగరానికి శ్రీకారం చుట్టానని చెప్పడం చంద్రబాబుకు అలవాటు. ఈ క్రమంలో హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు 163 కి.మీ మాత్రమేనని... అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 180 కి.మీ.తో ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ ప్రక్రియ కూడా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ముస్లింలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరస్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తామన్నారు. హజ్ యాత్రకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. నూర్‌బాషా కార్పొరేషన్ పెట్టి ఏడాదికి రూ.వంద కోట్లు ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. మైనారిటీ, ఫైనాన్స్ కార్పొరేషన్‌ల ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇచ్చే బాధ్యత తనదంటూ గుంటూరు పర్యటనలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నేటికీ నీటి మూటలుగానే మిగిలాయి. ఈ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. గుంటూరులోనే ఐటీ టవర్లు కట్టి వర్క్ ఫ్రం హోం విధానం తీసుకొస్తామని చెప్పారు. తాడికొండ ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రధానమైన తాగునీటి సమస్యను పరిష్కరించి ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. తాడికొండ కొండపై వేంచేసియున్న కొండ మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రస్తుతం ఉన్న ఘాట్ రోడ్డును సిమెంట్ రోడ్డు గా మారుస్తామని హామీ ఇచ్చారు. ఆచరణలో మాత్రం ఏ ఒక్కటీ సాధ్యపడటం లేదు. మంగళగిరిలో అధికారం వచ్చిన రెండు సంవత్సరాలలోపు ఇరిగేషన్ కొండపోరంబోకు, ఫారెస్ట్ చెరువులు, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి పట్టాలు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఇదీ నెరవేరలేదు.

అవినీతికి అండగా...

సంక్షేమం గాలికి వదిలేయడంతోపాటు అభివృద్ధి చేయకపోగా అవినీతికి గేట్లెత్తేశారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి అధికారులను తీసుకొచ్చి పెట్టారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇటీవల 21 మంది గుంటూరు కార్పొరేషన్‌కు వచ్చారు. వీరంతా రూ.కోట్ల మేరకు డైరెక్టర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోస్టింగ్‌లకు వచ్చిన వారిలో అవినీతి అనకొండలే ఎక్కువగా ఉన్నారని సమాచారం. ఒక అధికారిపై రెండుసార్లు ఏసీబీ రైడింగ్‌లు కూడా జరిగాయి. అదే టౌన్‌ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఏకంగా అసిస్టెంట్ సిటీప్లానర్ ఇన్‌చార్జిగా రెండు జోన్లు అప్పగించడమే కాకుండా ఏకంగా నగరంలోని సగానికి పైగా డివిజన్లు అప్పగించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



కొల్లిపరలో ధాన్యం ఆరపెడుతున్న రైతులు

అన్నదాతలకు కన్నీరు

జిల్లాలోని రైతులను కూటమి పాలకులు రోడ్డున పడేశారు. ఈ ఏడాది తుపాన్లు, వర్షాలకు రైతన్నలు పూర్తిగా నష్టపోయారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా అందలేదు. జిల్లాలో 1.41 లక్షల ఎకరాల్లో ఈసారి వరి సాగు చేశారు. ఇబ్బందులు వచ్చినా సగటున 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఈసారి బయట మార్కెట్‌లో ధరలు చాలా తక్కువ ఉండటంతో రైతులు ప్రభుత్వం వైపు ఆశగా చూశారు. జిల్లాలో 156 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం.. కేవలం పది వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి చేతులు దులుపుకొంది. నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోయాయి. కంది పప్పు, నూనెల ధరలతో పాటు ఉల్లి కూడా ఘాటెక్కింది. సామాన్యులకు సంక్షేమ పథకాలు అందకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త సంవత్సరం వేళ కాస్త సంతోషం కూడా లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

సివిల్ కేసులో పోలీసుల అత్యుత్సాహం



అద్దెకు నివాసం ఉంటున్న వజ్రకుమారిని బయటకు రావాలని టీడీపీ నాయకుడు విజయ్‌కిరణ్ అనుచరులతో దౌర్జన్యం చేస్తున్న దృశ్యం

- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన పోలీసులు
- ఇంటిని ఆక్రమించుకుంటున్న వ్యక్తికి అన్నివిధాలా అండ
- దౌర్జన్యంగా ఇంటి ఆక్రమణకు అధికార పార్టీ నేత యత్నం
- పోలీసులు జోక్యం చేసుకోవద్దన్న హైకోర్టు ఆదేశాలూ బేఖాతర్



బాధితులతో మాట్లాడుతున్న పట్టాభిపురం సీఐ వీరేంద్ర, ఎస్సై రాంబాబు

లక్ష్మీపురం: సివిల్ వివాదంలో ఉన్న ఇంటిని ఆక్రమించుకునే యత్నం చేస్తున్న అధికార పార్టీ నాయకుడికి పట్టాభిపురం పోలీసులు అత్యుత్సాహంతో అండగా నిలిచారు. సాయిబాబా రోడ్డు ప్రశాంతి నగర్ 2వ లైన్‌లో డిప్యూటీ మేయర్ వనమా వజ్రబాబు సోదరి వజ్ర కుమారి అద్దెకు ఉంటున్న ఇంటికి సంబంధించి సివిల్ వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు సివిల్ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని చెప్పినప్పటికి ఆ ఆదేశాలను ధిక్కరించి మరీ పోలీసులు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నాయకుడికి వత్తాసు పలుకుతున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు వజ్ర కుమారి తెలిపిన వివరాల ప్రకారం.... '' 2008వ సంవత్సరం నుంచి సాయిబాబా రోడ్డు ప్రశాంతి నగర్ 2వ లైన్‌లోని ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. ఈ ఇంటికి సంబంధించి సివిల్ వివాదం నడుస్తోంది. ఇదే ఇంట్లో నా భర్త కూడా అనారోగ్య కారణంగా కన్నుమూశారు. నా ఇద్దరు సంతానానికి కూడా ఇదే నివాసంలో వివాహం చేశా. నా తమ్ముడు డైమండ్ బాబు వైఎస్‌ఆర్ సీపీలో కీలక పాత్ర పోషిస్తూ ఉండటం, నగర డిప్యూటీ మేయర్‌గా ఉన్నారని అధికార పార్టీ తెలుగు యువత అధికార ప్రతినిధి అయిన యనమల విజయ్‌కిరణ్ అనే వ్యక్తి బలవంతంగా ఈ ఇంటిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నాడు. మా ఇంటిపై డిసెంబర్ 22వ తేదీన అనుచరులతో వచ్చి మహిళలు, చిన్నారులు అని కూడా చూడకుండా బయటకు గెంటేశాడు. వారి అనుచరులను అదే ఇంట్లో పెట్టి చాలా పెద్ద గొడవకు దిగాడు. ఆ సమయంలో పట్టాభిపురం సీఐ వీరేంద్ర కూడా మా సోదరుడైన డైమండ్ బాబు పట్ల దురుసుగా వ్యవహరించారు. బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించగా, జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవడంతో వదిలిపెట్టారు. పోలీసులు ఆ రోజు కూడా మమ్మల్ని లోపలికి రానివ్వకుండా కిరణ్‌కు పూర్తి మద్దతుగా నిలిచారు. అదే తరహాలో మంగళవారం స్వయంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై, ఏఎస్సై వచ్చి ఇంట్లో ఉన్న మమ్మల్ని గట్టిగా కేకలు వేసి బయటకు రావాలని బెదిరించారు. ఇదేంటని ప్రశ్నించిన నా కుమారుడు, కోడలు పట్ల దురుసుగా వ్యవహరించారు. కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న తనను కూడా ఇంట్లో నుంచి బయటకు రావాల్సిందిగా పోలీసులు పేర్కొన్నారు. బయటకు పంపించే యత్నం చేశారు. విజయ్‌కిరణ్ ఈ ఇంటిని ఆక్రమించుకోవాలని అనుచరులతో ఇంటి తలుపులు బద్దలు కొట్టి మమ్మల్ని బయటకు లాగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

మహిళ హత్యకేసులో నలుగురు అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న మంగళగిరి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ

పెదకాకాని: వివాహేతర సంబంధం కారణంగానే నంబూరు గ్రామంలో మహిళ హత్యకు గురైనట్లు మంగళగిరి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. పెదకాకాని పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. నంబూరు గ్రామానికి చెందిన షేక్ మల్లికతో అదే గ్రామానికి చెందిన షేక్ అక్బర్‌కు ప్రేమ వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. అక్బర్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అతడి ఆటోలో రోజూ రాకపోకలు సాగించే బోర్లు తీసే వారిలో ఒకరైన కారుమూరి ప్రేమ్‌కుమార్‌తో మల్లికకు పరిచయం ఏర్పడింది. దీంతో గొడవలు జరిగి దంపతులు విడిపోయారు. అనంతరం ప్రేమ్‌కుమార్‌ను ఆమె రెండో వివాహం చేసుకుని గుంటూరుకు వచ్చింది. 2021లో గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన బంగారు వ్యాపారి అబ్దుల్ రెహమాన్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత వివాహేతర సంబంధంగా మారడంతో మల్లికకు అతడు బంగారం , నగదు రూపంలో రూ.15 లక్షల వరకు ఇచ్చాడు. 9 నెలల క్రితం మల్లిక దంపతులు కాపురం నంబూరుకు మార్చారు. రెహమాన్‌ను కొంతకాలంగా దూరంగా పెడుతోంది. గ్రామానికి చెందిన నాగబాబుతో పరిచయం ఏర్పడిందని, అతనితోనే ఉంటానని హెచ్చరించింది. వారిద్దరూ శారీరకంగా కలిసి ఉన్న వీడియోను రెహమాన్‌కు వాట్సాప్ పెట్టింది.

వికటించిన వశీకరణ ప్రయత్నం

కక్ష పెంచుకున్న రెహమాన్ ఆమెను వశీకరణతో సొంతం చేసుకోవాలని, లేకుంటే కాళ్లు, చేతులు పడిపోయి మంచానికే పరిమితం చేయాలని గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని గాయత్రి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న షేక్ జనాబ్ అహ్మద్ మంత్రగాడిని ఆశ్రయించాడు. పదేళ్ల క్రితం ఢిల్లీ నుంచి గుంటూరుకు మంత్రగాడు వచ్చాడు. మల్లిక తల వెంట్రుకలు, దుస్తులను రెహమాన్ తెచ్చి షేక్ జనాబ్ అహ్మద్‌కు ఇచ్చాడు. పిండితో బొమ్మను చేసి వశీకరణ చేసినట్లు పేర్కొన్నాడు. అప్పటికీ ఆమె దక్కలేదు.

చున్నీతో గొంతు బిగించి హత్య

రూ.3 లక్షలు నగదు ఇచ్చి మల్లికను చంపేలా రెహమాన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. డిసెంబరు 28వ తేదీన షేక్ జనాబ్ అహ్మద్ తన అనుచరులైన ప్రకాశం జిల్లా పామూరు పడమట కట్టకింద పల్లి గ్రామానికి చెందిన ఎర్రబెల్లి కాజా రసూల్, గుంటూరుకు చెందిన మానిపాటి స్వప్నతో కలిసి నంబూరు చేరుకున్నాడు. స్వప్న స్కూటీ వద్ద నిలబడి ఉండగా అహ్మద్, కాజా రసూల్‌లు మల్లిక ఇంటిలోకి వెళ్లి ఒంటరిగా ఉన్న మల్లిక(29)ను నోరు మూసి చున్నీతో గొంతు బిగించి హతమార్చారు. నిందితులైన రెహమాన్, షేక్ జనాబ్ అహ్మద్, కాజా రసూల్, స్వప్నలను మంగళవారం అరెస్టు చేశారు. కోర్టుకు హాజరు పరచనున్నట్లు డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. మల్లిక దుస్తులు, రూ.40 వేల నగదు, స్కూటీ, సెల్‌ఫోన్‌లను నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ టి.పి. నారాయణస్వామి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై చర్యలకు డిమాండ్

- ప్లకార్డులతో గుంటూరు నగరంలో ర్యాలీ, నిరసన ప్రదర్శన
- జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించిన బార్, న్యాయవాదులు



గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కి వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

నగరంపాలెం: పొన్నూరులో న్యాయవాది ప్రకాశరావుపై పోలీసులు జరిపిన దాడిని సహచర న్యాయవాదులు ముక్తకంఠంతో ఖండించారు. ప్లకార్డులు చేతపట్టుకుని రోడ్డెక్కారు. దాడికి పాల్పడిన ఇద్దరు పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఈ మేరకు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ది గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టులోని బార్ హాల్ నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) వద్దకు చేరుకున్నారు. ప్రధాన రహదారిపై బైఠాయించడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. న్యాయవాదులకు రక్షణ చట్టాలు తేవాలని, పోలీసుల దౌర్జన్యం నశించాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. నగరంపాలెం పీఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని సర్దిచెప్పడంతో లోనికెళ్లారు. అనంతరం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ అధ్యక్షుడు శాంతకుమార్, పొన్నూరు సీనియర్ న్యాయవాది జి.ఎస్.రాయల్, జయరాజ్, నాగేశ్వరరావు, ఎన్.వర్ధన్‌రావు, షేక్. కరిముల్లా, క్రాంతి, రాజారావు నారాదాసు వీరమణి, షేక్. జిలానీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,500 గరిష్ఠం : రూ. 3,400

మోడల్ ధర రూ. 3,000

క్లుప్తంగా

రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలి



గుంటూరు రూరల్: రైతులు ఎదుర్కొనే సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం చూపాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ, మార్కెటింగ్, కోపరేషన్) బి. రాజశేఖర్ కోరారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నగర శివారులోని లాంఫాం నందున్న ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. బి. రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, శాస్త్రవేత్తలతో చర్చ గోష్ఠి నిర్వహించారు. ఇతర ప్రాంతాల వారు వర్చువల్‌గా పాల్గొన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ... అన్నదాతలు నూతన పద్ధతుల్ని ప్రోత్సహించేలా ప్రణాళికలను రూపొందించాలన్నారు. సమాజంలో చదువుకు ఉన్న విలువ తదితర విషయాలను విద్యార్థులతో చర్చించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీని విశ్వవిద్యాలయం అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏపీ రమణ, డీన్ ఇంజినీరింగ్ డాక్టర్ ఎ.మణి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ, సీఓఈ డాక్టర్ డి.సంపత్‌కుమార్, కంట్రోలర్ డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, ఎస్టేట్ ఆఫీస్ డాక్టర్ పి.రవి, వర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

సీఐ అప్రమత్తతతో దక్కిన ప్రాణాలు

తాడేపల్లి రూరల్: ఓ వివాహిత కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడే విధుల్లోన ఉన్న సీఐ అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడింది. తాడేపల్లి రూరల్ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలో అమరావతి కరకట్ట వెంబడి కృష్ణానదికి అనుసంధానంగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిపై నుంచి మంగళవారం ఆమె దూకింది. అక్కడే కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద మంగళగిరి సీఐ వినోద్ కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. కృష్ణానదిలో చేపలు పడుతున్న మత్స్యకారులను సీఐ వెంటనే పిలిపించారు. ఆమెను కాపాడి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆమె వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మహిళగా గుర్తించి, బంధువులకు అప్పగించారు.

కొర్నెపాడు లే అవుట్ రీ వెరిఫికేషన్‌కు ఆదేశం

గుంటూరు వెస్ట్ : గత ప్రభుత్వ హయాంలో కొర్నెపాడులో ఇచ్చిన 20 వేల గృహాల లేవుట్‌ను రీ వెరిఫికేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. లేఅవుట్ జాబితాలో అక్రమంగా ఎవరైనా ఉంటే తొలగించి, తుది జాబితాను తయారు చేయాలని పేర్కొన్నారు. దానిని టిడ్కో ఇళ్ల మంజూరు లబ్ధిదారుల జాబితాతో క్రాస్ చెక్ చేసుకోవాలని తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పేదలకు ఇళ్లు, స్థలాల కోసం వచ్చిన అర్జీలను అధికారులు పరిశీలించాలని సూచించారు. అర్హత కలిగిన వారికి ఇళ్ల స్థలాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, టిడ్కో ఈఈ ప్రసాదు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పండ్ల వ్యాపారం ముసుగులో మద్యం రవాణా

ముగ్గురు నిందితుల అరెస్టు

నెహ్రూనగర్: పండ్ల వ్యాపారం ముసుగులో చండీఘర్ నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గుర్ని అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం అరండల్‌పేటలోని 1 టౌన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం, తుంగపాడు గ్రామానికి చెందిన బొడ్డపాటి బాలకృష్ణ సొంత వాహనంలో పండ్ల వ్యాపారం పేరిట ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ రేటుకి మద్యం తీసుకువచ్చి అధిక రేట్లకు అమ్ముతున్నాడు. 2020లో నరసరావుపేటలో, 2024 జనవరిలో కేసులు నమోదయ్యాయి. రొంపిచర్ల తహసీల్దార్ ఇతనిపై రూ.2లక్షలకు బైండోవర్ కూడా చేశారు. అయిన బాలకృష్ణ బుద్ధి మారలేదు. 3 నెలల క్రితం చండీఘర్ నుంచి 20 కేసుల మద్యాన్ని తీసుకొచ్చి సగం అమ్మాడు. గుంటూరులో అమ్మేందుకు మిగతా విక్రయించేందుకు వ్యాన్‌లో మానస సరోవరం పార్కు వద్దకు చేరుకున్నాడు. ఎక్సైజ్ 1 టౌన్ పోలీసులు అతడితోపాటు రొంపిచర్లకు చెందిన ముంద్రు మస్తాన్‌రావు, ఆనపాటి యాకోబులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 120 మద్యం బాటిళ్లు, మినీ వ్యాన్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.2,46,960 ఉంటుందని డీసీ శ్రీనివాస్ చెప్పారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె. శ్రీనివాస్

మూడు గంటలపాటు ముప్పుతిప్పలు

పుష్పా సినిమా రేంజ్‌లో వ్యాన్ సెటప్ చేయించాడు బాలకృష్ణ. వ్యాన్‌కి ముందు భాగంపైన ఉన్న రేకును ఓపెన్ చేస్తే దాని లోపల నుంచి కిందకు ఒక మనిషి నిలబడేటంత ఖాళీ స్థలాన్ని తయారు చేయించాడు. అందులో చండీఘర్ నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చాడు. వ్యాన్‌ను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులకు సరకు ఎక్కడ ఉందో అర్థం కాలేదు. మూడు గంటలపాటు ముప్పుతిప్పలు పెట్టాడు. స్టేషన్ సీఐ లత వ్యాన్ ముందు భాగంలో పలుగుతో పొడిచారు. నిందితుడు అప్పుడు నోరు తెరిచి వ్యాన్‌ను ధ్వంసం చేయవద్దని కోరుతూ తానే మద్యం ఎక్కడుందో చెప్పాడు. అప్పుడు మద్యం బాక్సులను బయటకు తీయడంపై సిబ్బంది అవాక్కయ్యారు.

డిఫెన్స్ లిక్కర్ స్వాధీనం

గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌కు చెందిన దశరథ రామిరెడ్డి ఆర్మీలో లాన్స్ నాయక్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. గుంటూరు నగరంలో ఆర్మీలో రిటైర్డ్ అయిన వారి నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి అధిక రేట్లుకు అమ్ముతుంటాడని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. మంగళవారం బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద డిఫెన్స్ లిక్కర్ అమ్ముతున్న రామిరెడ్డిని అరెస్టు చేశారు. అతడి నుంచి 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.69,410 ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇ. మారయ్యబాబు, 1 టౌన్ సీఐ బి. లత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం ఆదాయంపైనే సర్కారు గురి

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 వేల మద్యం బాక్సులు కొనుగోలు చేసిన లైసెన్సీలు
- అర్ధరాత్రి వరకు వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లలో విక్రయాలకు అనుమతి

నెహ్రూనగర్: నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారించేందుకు రంగం సిద్ధమైంది. కొత్త మద్యం పాలసీలో లాటరీ విధానంలో ఊరూరా భారీగా షాపులు కేటాయించిన విషయం తెలిసిందే. ఇప్పుడు సదరు వైన్ షాపు లైసెన్సీదారులు, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు మద్యం భారీగా కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 వేల మద్యం బాక్సులు డిపో నుంచి లైసెన్సీదారులు కొనుగోలు చేశారు. రాష్ట్రంలో వైజాగ్, గుంటూరు జిల్లాలు అధికంగా మద్యం బాక్సులు కొనుగోలు చేశాయి.

జిల్లాలో 5 చోట్ల ఈవెంట్లకు అనుమతి

న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా గుంటూరు జిల్లాలో 5 ప్రాంతాల్లో ఈవెంట్స్ నిర్వహణతో పాటు మద్యం తాగేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. శ్రీ కన్వెన్షన్ ఇన్నర్ రింగ్‌రోడ్డు, మిడ్ వ్యాలీ సిటీ (ఆత్మకూరు), విజయవాడ క్లబ్ (తాడేపల్లి), కేఎస్‌ఆర్ కంటిన్యూమ్ అమరావతి రోడ్డు, డ్రైవ్ ఓ పోలీస్ రెస్టారెంట్ గుజ్జనగుండ్లలో ఈవెంట్ నిర్వహణతోపాటు మద్యం తాగేందుకు అనుమతి ఇచ్చారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళ, బుధవారాలలో వైన్‌షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, క్లబ్‌లు అర్ధరాత్రి దాటాక ఒంటి గంట వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

అభ్యంతరాలు సమర్పించండి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో భాగంగా జిల్లాలోని ఎస్సీల జనాభా, వారి వివరాల సేకరణపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే జనవరి 7వ తేదీలోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పించాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమం, సాధికారిత ఇన్‌చార్జి అధికారి బీఎస్‌ఎన్ రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జనవరి 11 వరకు అభ్యంతరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి జనవరి 17న కులగణన పూర్తి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. కులగణనలో మూడుదశల్లో తనిఖీలు ఉంటాయని తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీయూ డైరీలో పొందుపర్చిన అంశాలు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉన్నాయని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యాభివృద్ధిలో ఎస్టీయూ ముఖ్య పాత్ర పోషిస్తోందని తెలిపారు. టెన్త్ విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన విషయ పరిజ్ఞాన పుస్తకం అభినందనీయం అని పేర్కొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేసేలా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, నాయకులు కమతం శ్రీనివాసరావు, డీఏ జోసఫ్, షేక్ బాజీ, పేరేచర్ల శ్రీనివాసరావు, పి. దిబ్బయ్య, ఎ. వీరయ్య, జి. జోజప్ప, పి. ప్రసాద్, పి.సుందరరావు, ఎం. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు, జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ నాయకులు

రైళ్ల రాకపోకల సమయాలలో మార్పులు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని పలు రైళ్ల రాకపోకల సమయాలలో మార్పులు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల-రేణిగుంట(77211) రైలు ఉదయం 6.30 గంటలకు, రేణిగుంట-నంద్యాల(77212) రాత్రి 9.35 గంటలకు, కర్నూలు టౌన్-నంద్యాల రైలు(77209) రాత్రి 9.35 గంటలకు, లింగంపల్లి-తిరుపతి(12734) రాత్రి 10.45గంటలకు చేరుకుని రాత్రి 10.55 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. లింగంపల్లి-విజయవాడ రైలు(12796) రాత్రి 9.10 గంటలకు స్టేషన్‌కు చేరుకుని, 9.12 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. ధర్మవరం-మచిలీపట్నం(17216) ఉదయం 4.20 గంటలకు స్టేషన్‌కు చేరుకుని ఉదయం 4.25 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. యశ్వంత్‌పూర్-పూరి(22884) వారాంతపు రైలు ఉదయం 11.10 గంటలకు స్టేషన్‌కు చేరుకుని 11.15 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. యశ్వంత్‌పూర్-హౌరా(22832) వారాంతపు రైలు సాయంత్రం 4.30 గంటలకు స్టేషన్‌కు చేరుకుని సాయంత్రం 4.35 గంటలకు స్టేషన్ నుంచి బయలు దేరుతుంది. హౌరా-యశ్వంత్‌పూర్(22831) వారాంతపు రైలు 3.25 గంటలకు స్టేషన్‌కు చేరుకుని 3.30 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. తిరుపతి-సికింద్రాబాద్(20702) రైలు ప్రతి బుధవారం సాయంత్రం 7.40 గంటలకు స్టేషన్‌కు చేరుకుని 7.45 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. సికింద్రాబాద్-తిరుపతి(20701) రైలు ప్రతి బుధవారం ఉదయం 7.45 గంటలకు స్టేషన్‌కు చేరుకుని, 7.46 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. వాస్కో-షాలీమార్(18048) రాత్రి 8.20 గంటలకు స్టేషన్‌కు చేరుకుని రాత్రి 8.25 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. రేపల్లె-వికారాబాద్(17646) రైలు ఉదయం 8.45 గంటలకు చేరుకుని, 8.50గంటలకు స్టేషన్ నుంచి బయలు దేరుతుంది. సికింద్రాబాద్-రేపల్లె(17645) రైలు సాయంత్రం 6.30 గంటలకు స్టేషన్‌కు చేరుకుని సాయంత్రం 6.35 గంటలకు స్టేషన్‌కు బయలుదేరుతుంది. కాచిగూడ-రేపల్లె(17625) ఉదయం 4.05 గంటలకు స్టేషన్ నుంచి బయలు చేరుకుని, 4.10 గంటలకు స్టేషన్ నుంచి బయలు దేరుతుంది. హుబ్లీ-విజయవాడ(17329) రైలు ఉదయం 5.05 గంటలకు స్టేషన్‌కు చేరుకుని ఉదయం 5.10 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. ఔరంగాబాద్-గుంటూరు(17254) రైలు ఉదయం 3.25 గంటలకు చేరుకుని, 3.30 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. నాగర్‌సోల్-నరసాపూర్(17232) రైలు ఉదయం 5.05 గంటలకు స్టేషన్‌కు చేరుకుని, 5.10 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. నరసాపూర్-నాగర్‌సోల్(17231) రైలు సాయంత్రం 5.59 గంటలకు స్టేషన్‌కు చేరుకుని సాయంత్రం 6గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. సికింద్రాబాద్-త్రివేంద్రం(17230) సాయంత్రం 4.50 గంటలకు స్టేషన్‌కు చేరుకుని సాయంత్రం 5 గంటలకు స్టేషన్ నుంచి బయలు దేరుతుంది. హుబ్లీ-నరసాపూర్(17226) రాత్రి 9.30 గంటలకు స్టేషన్‌కు చేరుకుని, రాత్రి 9.35 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. లోకమాన్యతిలక్ టెర్మినల్-కోవా(17222) ఉదయం 4.29 గంటలకు చేరుకుని, 4.30 గంటలకు స్టేషన్ నుంచి బయలు దేరుతుంది. మచిలీపట్నం-ధర్మవరం(17215) రాత్రి 3.15 గంటలకు స్టేషన్‌కు చేరుకుని, 3.20 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. యశ్వంత్‌పూర్-మచిలీపట్నం(17212) రైలు ఉదయం 3.20 గంటలకు స్టేషన్‌కు చేరుకుని 3.25 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి రైల్వే సమయపాలన పాటించాలని కోరారు.

4న అభ్యుదయ రైతులకు పురస్కారాలు

చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లో జనవరి 4న విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ''అభ్యుదయ రైతుల పురస్కారాలు-2025'' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. సంబంధిత గోడపత్రికను చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఆయా విభాగాల డీన్లు తదితరులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ సంచాలకులు ఎస్. ఢిల్లీరావు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన 250 మంది అభ్యుదయ రైతు దంపతులను ఎంపిక చేసి సంక్రాంతి సంబరాల్లో భాగంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు, వెంకటేశ్వరరావు తదితరులు

వేలిముద్రలు పడలేదని పింఛన్ ఎగవేత

పెదకాకాని: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి సంఖ్యను తగ్గించే పనిలో నిమగ్నమైంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో టీములు ఏర్పాటు చేసింది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించే ప్రక్రియ చేపట్టారు. తాజాగా పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన కరణం లక్ష్మమ్మకు పింఛన్ ఇవ్వడానికి వెళ్లిన సచివాలయ ఉద్యోగులు.. వేలిముద్రలు పడటం లేదని డబ్బులు ఇవ్వకుండానే తిరిగి వచ్చేశారు. వాస్తవానికి పెద్ద వయస్సు ఉన్న వారి వేలిముద్రలు అరిగిపోయి పడకపోతే ఐరిస్కు టెకీకో ద్వారా పింఛన్ ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 96 సంవత్సరాల వయస్సు ఉన్న కరణం లక్ష్మమ్మ ఒంటరిగా ఉంటున్నారు. ఎటువంటి ఆస్తులు లేవు. బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ జరిగి ఒక కన్ను చిన్నదిగా మారడంతోపాటు మూతి కూడా వంకర పోయింది. ఈ పరిస్థితిలో వేలిముద్రలు పడలేదని పింఛన్ ఇవ్వకపోతే ఎలా బతకాలని లక్ష్మమ్మ రోదిస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి వృద్ధురాలికి పింఛను అందజేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



కరణం లక్ష్మమ్మ

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి చర్యలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కార్యాలయం పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 44 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఉద్యోగాలకు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిలో ఎంపికైన వారు పనిచేయాల్సి ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ జనవరి 30, 31వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి, ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేయాలని వెల్లడించారు.

వరుణ్ వీరోచిత సెంచరీ

82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా


వరుణ్

అహ్మదాబాద్: భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1–0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరఫున రోబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రోబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.



మహిళల విభాగంలో అగ్ర స్థానంతో నాకౌట్‌కు అర్హత

- హంపి చేజారిన అవకాశం
- వరల్డ్ చెస్ 'బ్లిట్జ్' చాంపియన్‌షిప్

వారెవ్వా వైశాలి

న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పొలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్ర స్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జూ జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నప్పుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

అర్జున్‌కు నిరాశ...

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజీబెక్ నొగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు

- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ


సందీప్

ముంబై: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.


అశ్విన్ శ్రీకర్ భరత్

2025 స్పోర్ట్స్ క్యాలెండర్
మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● ఎన్టీఆర్ ● ప్రభాస్ ● మహేశ్ బాబు

2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...

విదేశాల్లో 2025

చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.


● కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజి' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల


● సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.

ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.


● సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

2024ని మంచి సినిమాతో ముగించాను

– జాన్వీ కపూర్



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్టాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

గుండె జారిపోయిందే!

వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో–నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ–వంశీ.


● వరుణ్ రాజ్, మమత

ఓటీటీ | **ఇది చూడొచ్చు**

సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.



తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమిర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది, కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టి. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి. కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.